# పేదరాలు

శ్రీమతి వెలిసంఢ మాడిరుదుంతిమ్మగారు

మధ్యాహ్నము మూడుగంటలైనది. బ్యారిష్టరు రంగనాథన్ గారింట్లో ఉన్న పనివాళ్లందరు ఊపిరి విడుచుటకైన తీరికలేక ఉక్కిరిబిక్కిరిగ ఇటూ అటూ పరుగెత్తుచుండిరి. అధికారులు అనధికారులు అగు చాలామంది పెద్దలందరు కార్లమీదను, బండ్లమీదను, కులకులమని దిగుచుండిరి. వారు అలకరించుకొనిన చిత్రవిచిత్రములగు ఆభరణాంబరములు, పేదవారల హృదయములు దద్దరించునట్లుగా, కండ్లను, మిరిమిట్లు గొలుపుచుండెను. రంగనాథన్ రత్నకుమారి గార్లు వచ్చినవారందరికి కైలాగులనిచ్చుచూ ఉత్సాహమైన మాటలతో ఎదుర్కొంటూ లోనికి పంపుచుండిరి. లోపలఉన్న హాలంతా విదేశీయ పనిముట్లతోను, విదేశీయ సిల్కువస్త్రములతోను, చక్కగా అలంకరింపబడి చూచేవారలకు బహుఆకర్షణీయముగ కనిపించుచుండెను. పైన ఎలక్ట్రిక్ ఫానులు టకటకమని తిరుగుచుండెను. స్పెన్సరుకంపెనీ బోయీలు యూనిఫారండ్రెస్సు తొడుక్కొని చకచకతిరుగుతూ పరిశుభ్రమైన టేబిల్సుమీద ప్లేట్లతో ఆహారవస్తువులను అమర్చుచుండిరి. ఈవచ్చినవారందరు అనేకవిధములైన ప్రసంగములు చేసుకొనుచూ తీపిగా ఆహారమును ఆరగించుచుండిరి. చివరకి ఒక గ్లాసులోపోసి అందిచ్చిన రసముతో ఆవిందును ముగించి, అమెరికానుండి ప్రత్యేకంగా ఈవిందుకొరకు పిలిపించిన ఒక స్త్రీ యొక్క ఆటకొరకు ఎదురుచూచుచుండిరి. ఇంకా దీపములు పెట్టలేదు. పేదసాదలు కూలివాలులు ముగించుకొని తమ కొంపలలోఉన్న దమ్మిడీలను, కానులను లెక్కపెట్టుకొంటూ మాటాడుకొనుచుండిరి. ఈరోజుకు ఈశ్వరుడు మనకింతే ఇచ్చినాడను పెద్దల అమృతవాక్కు ఆ నిరుపేదలకు తృప్తినిచ్చుచుండగా తమచేతనున్న అణాదబ్బులకు గాను తమపిల్లలును తినడానికి ఏమివచ్చునా అని యోచించుకొనుచూ బజారుకు కాళ్లీడ్చుకొనుచూ పోవుచుండిరి. కొందరు తమకీరోజున కూలి అసలే దొరకలేదని చిన్నబోయినమొగములతో తమగుడిసెలకు వెళ్లుచుండిరి. ఆసమయంలో మహోత్సాహంగాఉన్న రంగనాథన్ గారి గుమ్మముపద్ద 15 సంవత్సరముల నవయౌవనవతియైన ఒక స్త్రీ చిన్నబోయినముఖముతో చేతిలో ఒక భిక్షాపాత్రము పట్టుకొని నిలుచుండెను. ఆమె కట్టుకొనిన బట్ట చాలమాసిపోయి చినిగి ఆమె శరీరానికైనను పూర్తిగా కప్పలేకుండాయుండెను. కాని ఆమె సహజమైన యౌవనలావణ్యమును మాత్రము మరుగుపరచలేక శత ఘాల చూచువారందరికి ఈమె చాలాగంభీరమైన హృదయముగలదనియు, చాలా పవిత్రమైన చరిత్ర గలదనియు తోపించుచుండెను పక్షపాతరహితమైన ప్రకృతిదేవతయిచ్చిన సౌందర్యము ప్రకాశిస్తుండగా మెల్లని కంఠస్వరముతో "అమ్మా దిక్కుమాలిన దీనజాతిని: పిడికెడుబియ్యమును దయచేయండి. నాలుగు రోజులై మంచినీళ్లు తప్ప రెండో ఆహారములేక బాధ పడుచున్నాను." అని దీనముగా అడుగుచుండెను. గుమ్మమువద్ద కావలికాస్తూఉన్న దర్వాన్ ఖాన్ అధికారసేవావాసనచేత కండ్లెఱ్ఱచేయుచూ పండ్లు పటపటకొరకుతూ "ఓసీ నిర్భాగ్యురాలా! ఇక్కడ మాత్రము నోరుచెయ్యకు! అయ్యగారు, అమ్మగారు విన్నారంటే నీకూ నాకూ గూడా తలలెగిరిపోగలవు. వెళ్లిపో. ఇంకా వెళ్లవేమి? పందికొక్కులాగ ఇంటింటా ఇలాతిరిగి అందర్నీ వేధించకుండాఉంటే ఎక్కడనైనా కష్టపడి కూలిచేసుకోకూడదూ, పో. అవతలికి పో. జల్దీజల్దీ." అని కళ్లనాడిస్తూ బెదరించెను. ఆపేదరాలు కులికూలిపోవుచున్న తనశరీరమును తన ధైర్యబలంబనచే నిల్వబెట్టుకొనుచూ "నాయనా! కూలివాలల



1020

కోరకు నేనెంత దేవురించితినో నీకు తెలిసిన ఇలాగనియుండవు. నన్ను చూచిన నీకు కనికరము పుట్టకపోవచ్చును. తొంబదిసంవత్సరాల ముసలిబడుగు ఈతిండిలేని కారణముచేత తటతటకొట్టుకొంటూ ప్రాణావసాన స్థితిలోఉన్నది. ఆసంగతిని వినిర్దయిసా కొంచెము కనికరించుము.” అనెను.

దర్వాన్:—నా కేమీ అవసరములేదు. నీఅబ్బ ముల్లెదాచినట్లుగా అలాగు గుమ్మంపట్టుకొని వదలకుండా ఉన్నావేమి? నీకు దేహమర్దనము కావలసినట్లు కనపడుతున్నది.” అనెను. ఇంతలో లోపలనుండి “ఫ్యూన్” అనేకేక వినబడెను. వెంటనే అతడు “వస్తూన్నానండీ అమ్మగారూ” అని అంటూ “ఓసే వెళ్ళెదవా లేదా” అని గాండ్రించుచూ అరచుచుండగా లోపలనుండి “ఇంకనూరావేమి” అని కేకలు వేయుచూ రత్నకుమారి విసవిసవచ్చి “ఓరీ నీకు చెవులు లేవా? పిలిచినవెంటనే ఎందుకురావు” అని కసరి “ఓరి వెధవా ఈగుంటతో సరసాలాడుతూ కదలిరాలేకున్నావా? నీరోగము దానిరోగము కూడా వదలించెదనులే.” అని అనుచుండగా “అమ్మగారూ! దీనికి బిచ్చముకావలెనని మొండికేసి కూర్చున్నది. నేను ఇంతకుముందే మీయాజ్ఞను ఎరిగున్నవాడిని కాబట్టి దీనిని వెళ్లగొట్టుతున్నాను” అని దర్వాన్ జవాబిచ్చెను.

రత్న:—ఛీ నోరుమూయి. చేతకాని సందవు. నీ బ్రతుకుకు చేసినతప్పు సమర్థించుకోవటంకూడనా?

పేదరాలు:—(అవమానముచే కలిగిన రోషవిచారములతో) తల్లీ! మీ రనవసరముగ ఉపయోగింపకూడని నిందావాక్యాలను పల్కినారు. మీరుకూడా జన్మముచేత స్త్రీలైనప్పటికీ స్త్రీలకు సహజముగా ఉండవలసిన ప్రేమవాత్సల్యాలు ఆత్మగౌరవము, ఎందుచేతనో గాని లోపింప జేసుకొంటున్నారు. నిజమైన ఆత్మగౌరవము మీయందు ఉన్నట్లైతే తోటి స్త్రీని ఇంతనీచమైన అవమానపుమాటచేత నొప్పించరు. మీరు ధనవంతులుగదా అని నాకడుపుకక్కూరితి ఈ విధముగా నన్నిక్కడికి ఈడ్చుకొనివచ్చినది.” అని అంటూ వెళ్లబోవుచుండెను. ఆమాటలను వింటూ ఉన్న రత్నకుమారి పట్టలేని అహంకారముతో ధనాధికారములు మంచిచెడ్డల తెలియనీయనందున దర్వాన్ ఖాను చేతిలోఉన్న బెత్తాన్ని తీసుకొని ఆ పేదబాలికను దిట్టముగా నాల్గుతగల్చెను. అప్పు డీపేదరాలు ఇక తాను మాటాడుట లాభములేదనుకొనుచూ తన సుకుమారమైన శరీరమంతా రక్తము క్రక్కుతూ ఉంటే ఈఅన్యాయము, అధర్మ పరిస్థితులు, దారిద్ర్య ధనవంతులమధ్యనుండే ఈఅగాధమైన తేడాలు ఆలోచించుకొంటూ ఈశ్వరుని దలచుకొంటూ నడచుచుండెను.

౨

“అమ్మాయీ ఎందుకు నీశరీరమట్లు ఎఱ్ఱగాకందిరక్తము చిమ్ముచున్నది? ఏరాతిగుండెగలవాళ్ళు నీ శరీరము అంత కందిపోయినట్లు నిర్దాక్షిణ్యముగా బాదిరి?”

“అవ్వా! నే నేమని నీతో చెప్పను. రోలాచ్చి మద్దెలతో మొత్తుకొన్నట్లుగా ఉండును మన వెంట్లు ఒకరితో ఒకర దుసుకొనుట. ఈరోజు ప్రొద్దుటినుండి మా అవ్వపడేబాధను చూడలేక పోయాను. ఇంట్లో చారెడునూకలైనలేవు గంజి కాచటానికి. అప్పుడు ఒకవిధమైన తెగింపుతెచ్చుకొని మా ఇరుగుపొరుగువా రిళ్ళకు వెళ్ళి పొట్టకొందట ఏమైన దొరుకునేమో అని చూచాను. ఒకఇంట్లో ఉన్న ఇల్లాలు ఒక చిన్నకుండెడు సంకటిని కాచినారు కాబోలు. చిన్నచిన్నచిప్పల్లో ఇంతింత సంకటి వేసి ఇంట్లోఉన్న నల్గురుపిల్లలకు సర్దుతూఉన్నది. వంచుకొనుటను ఒక్కొక్కపచ్చితెలకపిండిఒడియం చేతికిచ్చింది. ఆపిల్లలు అది చాలదని గిలగిల తన్నుకొంటూ ఏడుస్తున్నారు. నాగుండె ఝల్లుమన్నది. ఇంకొంచెం పెదగ్గరికే వెళ్లాను. అఇంట్లో పెద్దవాళ్లు ఎవ్వరూలేరు. కూలినుండి

1021

రాలేదు కాబోలును. నేలకంటిన ఆపొట్టిచూరుకే ఒక కుళ్లుచింకిపంచెలో ఇరవైరోజులబిడ్డ మలమూత్రాలు చేసుకొని కారుకారుమంటూ గుక్కతిప్పుకుండా ఏడుస్తూఉన్నది: మ్యునిసిపల్ వారి ధర్మమాఅని ప్రత్యేకముగా వీరిసొంతం ఉండేదయుచేత ఎత్తివేయకుండావున్న చెత్తకుప్పలమధ్య దిసమొలలతో ఎడపిల్లలు ఆడుకొంటున్నారు. ఆపిల్లలు ఈచంటిబిడ్డ ఏడుపును వినగానే దబదబావచ్చి ఆఉయ్యాలను గట్టిగాఊపి ఆబిడ్డను ఊడ్డుగుడుచుకొన్నట్లుగా చేసిపోవుచుండిరి. ఇలాగే అక్కడఉన్న కూలిజనం గుడిసెల్లోకి వెళ్లిచూచాను. ఒక్కఇంట్లోకూడా ఒకపూట గంజికాచటానికైన చారెడుబియ్యము నిలవలేవు. ఇంక ఇక్కడంతా ఇదే మచ్చువారముగదా అని అధికారపదవుల్లోఉన్న పెద్దపెద్దవీధుల్లోకి వెళ్లినట్లైతే మా అవ్వప్రాణము కాపాడుకొనగలననే భ్రాంతితో ఆ పెద్దవీధుల్లోకి వెళ్లి నేపొందిన బహుమానమిది.

ముసలిది:—అయ్యో ఎంతపని జరిగింది. నీతల్లి చిన్నతనంనుంచి మిమ్ములను నేనెరుగుదును. ఎంతో బుద్ధిమంతురాలు, అంత యోగ్యురాలు ఇక పుట్టబోదు. దరిద్రబాధచేత సరియైన ఆహారములేనందున నీవు కడుపున పడినప్పటినుండీ నీతల్లి చాలా నీరసించిపోయింది. నెలలు నిండినతరువాత నిన్ను కనగానే మొగముతిరిగి పడిపోయినది. అదే ఆఖరు. నీతండ్రి ఆశవమును దహనపరిచటానికికూడా శక్తిలేనందున అంతకుముందే విచారంతో కృంగిపోతూఉన్న అతని మనస్సు ఈవిచారంతో మరీ చలించి దేశాలపాలైనాడు. ఇప్పుడు నిన్ను పెంచుతూవున్న ఆ అవ్వ నీసౌందర్యానికి ముగ్ధురాలై తన కడుపు కట్టుకొని, నిన్ను పెంచి పెద్దదానినిచేసింది. ఏదో విధంగా నీస్వబుద్ధిమూలమున, ఆఅవ్వ తరిఫీదువలనా కొంత జ్ఞానము సంపాదించావు. తల్లీ! నీవు చాలా దురదృష్టవంతురాలివి. దారిద్ర్యబాధకుతోడు దెబ్బలు కూడా తిన్నావు. ఒక పల్లెటూరిభాగమందు తనఇంట భారసాలని వచ్చినవాళ్లందరికీ లేదనకుండా ఒకపూట భత్యమని రెండేసి అణాలుచొప్పున ఇచ్చినాడు. ఈ రెండణాలు నీవు తీసుకొనివెళ్లిపో. ఈ పూట కు గడచిపోవును గదా. తెల్లవారి మనబాధలు మనవే. ఆనాడు కుశలాయుగంలో చెప్పినట్లుగా మనకు "దిన దినగండం నేయేళ్లు ఆయుష్షు" పద.

పేదరాలు:—అవ్వా! ఒక్కఅణా చాలు. ఆ భాగమందు గ్రామాల్లో నివసించేవాడు కాబట్టి ఇంకా ఈ బారసాలలు ఈపెళ్లిసంతర్పణలు పెట్టుకొన్నాడు. లేకపోతే ఈవిధముగా ఖర్చుపెట్టుట కిష్టపడనే పడడు. ఏపనిమంది పెద్దవాళ్లకో ఒక వెయ్యిరూపాయిలు ఖర్చుపెట్టి ఒక టీపార్టీ పెట్టి తన జన్మమంతా సార్థకం అయిపోయినట్లుగా సంతోషించేవాడు. దేవునిచేత సృష్టింపబడిన ఈ ప్రపంచంలో ఇంత అన్యాయం ఇంతఘోరం ఎన్నాళ్లుజరగాలో రోజురోజుకి బ్రతుకడం ఎల్లాగాఅన్న చింతతప్ప రెండో దానికి దేనికీ అవకాశమే లేదు మనకి.

ముసలిది:—కాలమంతా పూర్తిగా మారిపోయింది. నా చిన్నతనంలో ప్రతివాళ్లము ఇంతో అంతో వ్యవసాయం చేసుకొంటూ, ఒక గేదె, ఒక ఆవు పాడితో హాయిగా మేము పదిమందిమీ కాలక్షేపం చేసుకుండేవాళ్లము. తెల్లవారి ఒక కానీని కూడా చూడవలసిన అవశ్యకం లేకపోయేది. మాకు పండింది ఒకరికిచ్చేవాళ్లము. ఒకరికిపండింది మేము తెచ్చుకొనేవారము. దగ్గరఉన్న బీళ్లులోకి హాయిగా పశువులను తీసికొనివెళ్లి మేపుకొని వచ్చేవారము. దగ్గరగాఉన్న ఏఅడవుల్లోకివెళ్లినా మాకు కావలసినంత వంటచెఱకు సంవత్సరానికి కట్టె బహుస్వల్ప రుసుముతోనే తెచ్చుకునేవారము. అటువంటి కాలమంతా ఇంత విషమించింది. మొన్న నీ మధ్య పొరుగునఉండే 10 ఏళ్లపిల్ల దగ్గరగాఉన్న ఒక అడవి లోకివెళ్లి తెలియక కంపనరకటానికి కొడవ లెత్తిందట. దానికి వెంటనే పెనూ. జుర్మానా అధికారులు



1022

వేసేశారు. పాపము వాళ్లు బ్రతుకుటే కష్టముగా ఉంటూఉన్నప్పుడు డబ్బురూపంగాఉండే ఈజుర్మానాను ఏవిధంగా చెల్లించుతారు. దీన్ని యోచించి తీర్చేనాథు డెవ్వడూ కనిపించడు. మీదుమిక్కిలి పన్నులుమాత్రము ఏటేటా క్రొత్తక్రొత్తవి క్రొత్తక్రొత్త రూపాలుగా ప్రత్యక్షమవుతున్నాయి.

పరిపాలనా సౌకర్యంకోసరం ఏర్పడ్డ వేర్వేరు స్థానికసంస్థ లన్నీకూడా వేరువేరు పన్నులను ఒకే మనిషికి తగిలిస్తున్నారు. వాటిని లెక్కపెట్టడానికి వీల్లేదు, ఆపన్నులను వెయ్యడంలో ఈమనిషి ఇచ్చి తీరవలెననే ఉద్దేశమే గాని ఇవ్వగలశక్తి యున్నదా లేదా అని యోచించి వేయుపద్ధతి సుతరాం ఎక్కడా లేదు. ఒకేమనిషిని నలుగురు నాలుగువైపుల తలోసారి వచ్చి తలో తన్నుతన్ని ఎవరిమట్టుకు వారు ఈ ఒక్క డబ్బే గదా అని తలచినట్లుగా తలావకరు తలోరూపంగా పన్నులు వేస్తున్నారు. మనిషికి వచ్చు నికరాదాయాన్ని పుచ్చుకొని వాడి జీవితాధారం పోను ఒక్కసారే ఒక్కటే పన్నును వేసినయెడల న్యాయముగను సబబుగాను యుండియుండేది. ఈ కారణాలవల్ల వ్యవసాయదారుడు కష్టపడి పండించే దానికన్న భూమిని వదలివేస్తేనే బాగున్నట్లు తలప వలసిన అవసరం వస్తున్నది. అందుకోసరం గ్రామస్థు లందరు గ్రామాలనీ వ్యవసాయాలనీ వదలివేసి పన్నులబాధలను మధ్యవర్తుల దండగాలనూ భరించ లేక గ్రామాల్లో కడుపుజరక్క పట్నాల్లో కూలి చేసుకుందామని మొత్తముమీద అందరూ దాస్య వృత్తికి తయారు కావలసి వచ్చింది. అందువలన గ్రామాల్లో నిత్యమూ మామూలుగా నడుస్తూఉన్న గృహపరిశ్రమలన్నీ నశించినవి. వ్యవసాయము కడుపు నింపుతూఉంటే ఈచేతిపనులమూలాన తమ ఇతరఖర్చులు సౌఖ్యములూ జరుగుతూఉంటే గ్రామస్థు లందరూ ప్రపంచము తల్లక్రిందలైనా తాముమాత్రము తొణకవలసిన అవసరంలేకుండా హాయిగా ఉంటూ ఉండేవారు. అందుమూలాన తాము సౌఖ్యపడుటయే గాక సమస్తప్రజలకు తిండికి కష్టములేకుండా జరిగి పోతూ ఉండేది. ఇక ఇక్కడ చూడబోతేనా (అనగా పట్నాల్లో) మన సౌకర్యంకోసరం చాకిరీ చేస్తున్నామా, లేక చాకిరీకోసరమే మనముపుట్టామా అనే ప్రశ్నలోనికి వచ్చినాము. నిజానికి చూడబోతే చాకిరీకోసరమే మనంపుట్టాము అని రుజువవుచున్నది. ఏమిల్లుకుపోయినా ఏకూలికిపోయినా ప్రొద్దుటే 6 గంటలు కొట్టకుండావెళితే 12 గంటలు కొట్టే వరకూ గొడ్డుచాకిరీచేసి తిరిగి రెండుగంటలకే వెళ్లి సాయంత్రం 6 గంటలవరకు అవిధంగానే చేసితీరాలి. అంత చాకిరీ చేస్తేనేగాని ఒక్కపూటైనా గడవదు. అంత చాకిరీకి సరియైన ఆహారము, సరియైన ఉత్సాహ పరిస్థితులు లేనందున శక్తియుండదు. అందువల్ల మస్తుగా తాగటం అలవాటు చేసుకుంటారు. దానికి తోడు సహావాసాలు ఎక్కువ ప్రోత్సాహం చేస్తూ ఉండగా, మన అధికారులుకూడా చాలా చవుకగా పేదవాళ్లమీదఉండే దయచేత చేసేషాపులవల్లనూ బాగా త్రాగుబోతులై, చేతకానిపందలై, జీవచ్ఛవాలై చెడిపోతున్నారు. ఈత్రాగుడే ఆహారముగా కూడా మారిపోయిన కాలంవచ్చింది. ఈత్రాగుడు మూలాన కలిగేఅవస్థలు పోట్లాటలు వేరే చెప్ప నవసరములేదు. వాళ్లిచ్చిన కూలిడబ్బులు కాస్తా ఇలాగ వ్యయమైపోగా ఇంట్లో పెళ్లాంబిడ్డలు మామూలుపస్తే. ఈవిధంగా మనవాళ్లబ్రతుకులు తారుమారు కావలసినపరిస్థితులు ఏర్పడ్డవి. ఇంతకూ మనఅవస్థలు తీరేవిధము కలలోకూడా కనపడటం లేదు. ఇక వెళ్లు ప్రొద్దుపోయింది. రేపు కలుసుకుందాం.

3

ప్రతాప దేవవర్మ మహారాజుగారు చాలా ఉదార హృదయం గలవారనిన్నీ, సరసులనిన్నీ, విద్యావంతు లనిన్నీ, కించిత్పరమార్థ చింతగలవారనిన్నీ ప్రసిద్ధి. ఐశ్వర్యవంతులలో అంత నిగర్వచూడామణిని

చూడటం ఆనందనీకూడా వాడుక. అతడు ఒకరోజున ప్రొద్దుటే 8 గంటలకు తనహాల్లోనే ఒంటరిగా ఏదో గ్రంథమును చదువుకొంటూ కూర్చుండెను. అప్పుడు లోపలినుండి ఒకయువతి ఆయన యున్న చోటికివచ్చి కొంచెము ప్రక్కగా నిలుచుండెను. ఆయన కొంతసేపటివరకు ఆవిడను చూడలేదు కాని తరువాత చూచి "అమ్మాయీ శకుంతలా! ఎందు కిలాగు వచ్చావు. నీశరీరము ఇంకా నీరసముగా ఉన్నదనిన్నీ ఒక నెలవరకు కదలకూడదనిన్నీ డాక్టరు చెప్పారుకదా? ఆరోజున నువ్వు నా కారుక్రింద పడి పోయినప్పుడు నీవు తిరిగీ ఈ స్థితిలోకి వస్తావని అనుకోలేదు సుమా. ఇంతకూ భగవంతుడు నాపాలిట ఉన్నాడు. లేకపోతే నీవంటి ఉత్తమ జీవిని లోకంలోనుండి తప్పించిన పాపము నాకొడుకుకు చుట్టుకొనియుండేది. అయినా ఆరోజు కార్లకూడా పడి, బండ్లకూడాపడి, గవర్నరుగారి రాకవలన మేమిచ్చే టీపార్టీలవలన ఎక్కడా తెన్ను తెరపి లేకుండా ఉండెను. నిన్ను చూచినవేళా విశేష మేమిటోగాని కల్యాణహోమునికి శకుంతల్లాగ నీవు నాకంటికి కనబడగానే శకుంతలాఅని పిలవవాలని బుద్ధిపుట్టింది. మీఅవ్వకూడా ఖులాసాగా ఉన్నది కదా?

పేదరాలు:—తండ్రీ! మీరు చూపించేదయకూ ప్రేమకూ నేను చాలా కృతజ్ఞురాల్ని. మీవంటి వదాన్యుల్ని ఈకాలంలో సాధారణంగా చూడ లేము. తెన్నుబోయే భిక్షురాల్ని తెచ్చి ఇంతవరకూ ఇంతజాగ్రత్తగా చూడటం ఈకాలంలో అరుదు. నా శరీరంలో ఇప్పటికి చాలావరకు దారుఢ్యమొచ్చింది. ఇక మీకు శ్రమను ఇయ్యలేను. తమరికి నాయందు దయవుంటే మాఅవ్వనిమాత్రం మీనౌకర్లఇళ్లలో దేనిలోనైనా ఉండటానికి అవకాశమిస్తే చాలా సంతోషం.

వర్మ:—(ఆశ్చర్యంతో) ఏమీ! జీవనాధారం ఏమీలేని నీవిప్పుడు ఎండల్లో వానల్లో ఒంటరిగా కడుపుకోసరం దేవులాడుతూ వెళ్లిపో దలచినావా? వద్దు. వద్దు. నీకిక్కడ ఏమైనా లోపంజరిగిందా? నీఅవ్వకు శుశ్రూషచేసుకుంటూ నా ఇంట్లో నే ఒకచోట ఉండు. నీగౌరవానికి ఏమీ లోటు రానీయను. నేచెప్పినట్లుగా చేయుము. నామాట వినుము.

పేదరాలు:—తండ్రీ! నేను పుట్టినప్పట్నుండి ఇంత ఆదరణ, ఇంత సౌఖ్యము ప్రపంచంలో ఇంకా ఉన్నదనేసంగతే నాకుతెలియదు. గాని మీరు నన్నెంత పుత్రికాభావంతో చూచినా, నేను నాయీ స్థితిలో మీగృహంలో శాశ్వతంగా ఉండటం మంచిదిగా నామనస్సుకు తోచటంలేదు. అదిగాక మావంటివారు నివసించేతావులు వేరే యున్నవి. దయచేసి సెలవీయండి.

వర్మ:—(విచారంతో) నిన్నెవ్వరైనా ఏమైనా అన్నారా ఏమిటి? నీవు నివసించవలసినతావులు వేరే యున్నాయని చెప్పావుగదా! పరమేశ్వరుడు ఒక్కొక్కమనిషికి ఒక్కొక్కతావని నొసటవ్రాసి నిర్ణయించాడా? ఇవిఅన్నీకూడా మానవులు తమ అధర్మయుతమైన వక్రబుద్ధులచేత కల్పించుకొన్న కృత్రిమపద్ధతులు. దురభిమానపూరితమైన పాషాణ ధర్మాలు.

పేదరాలు:—ఇలాగైతేనేమి? ప్రస్తుతంలో అందరూ అవలంబిస్తూఉన్న పద్ధతులే అవికదా. మాలో ఎవరైనా తమరికి కలిగేబాధలు, తమరుపడే ఇబ్బందులు నోరుతెరచి చెప్పటానికి సాహసించినా వినేవాళ్లేలేరు. మీదుమిక్కిలి "రాజుగారని చెప్ప వస్తే మరిరెండు తగిల్నియ్యి" అన్న సామెత మాయందు సార్థకమవుతుంది. మీరు అనగా ఐశ్వర్య వంతులు నిత్యమూ అనుభవిస్తూయున్న సౌఖ్యాలు, అనుభవాలు వేరువేరుగా నే చెప్పఅవసరంలేదు. మాస్థితిగతులు ఊహామాత్రంచేతకూడా మీకందు

బాటులోనికి రావు. మేము ఉండేతావులు, కట్టుకునే బట్టలు, తినేతిండి, పీల్చేగాలి అన్నీకూడా మీవాటికి మారి హస్తిమశకాంతరాలు. మీరు వేసవెండెక్కితే ఉక్కపడి మార్బుల్ రాళ్ళ బంగళాల్లో, చల్లనిగాలి వచ్చే ప్రదేశాల్లో, హంసతూలికాతల్పాల్లో హాయిగా చీమ చిటుక్కుమనకుండా నిద్రపోతారో ఆసమయంలో మేము కడుపులోకి ఉప్పులేనిగంజైనా లేక పైని నెత్తి, క్రింద కాలు, లోనకడుపు మలమలమాడ్చివేస్తూ ఉండగా ఇంటింటా పిడికెడు బియ్యము కోసం యాచించుచూ, సామంతుల నిద్రాభంగమైనదను నిందలకు గురియౌతూ మిడిఎండలో తిరుగుతూ ఉంటాము. మమ్మల్ని చదువురాని వాళ్లని అనాగరీకులని నిందిస్తూఉంటారు. ఆరోగ్యముగాఉండమని చెపుతారు కాని మాకు తగిన నీటిసదుపాయం కల్పించరు. పిల్లలకు చదువుచెప్పించుమని బోధిస్తారుగాని చదువుకునేటందుకు తగిన సదుపాయాలు చేయరు, సరిగదా కడుపుకోరకై 5 వ ఏడు వచ్చినప్పటినుండి దేవులాడవలసిన పరిస్థితుల్లో ఆచదువేమివస్తుంది. అదేమి వంటపడుతుంది. మేమేమికష్టపడో ఒకబెడ్డబ్బులు బజారుకు పట్టుకొనివెళ్లితే ఆబజారువాడంతకంటె మోసముచేస్తాడు. వాడి కండలోనే కక్కుర్తి పాపము. మనిషియొక్క ఆదాయానికి, బజారురేట్లకు ఎట్టిసంబంధము లేదు, దాన్నిగురించి మన అధికారులకు నాటనేలేదు. యోచించటానికికూడా అవసరం కనపర్చరు. ఒకఉద్యోగికి దాదాపు సంవత్సరానికి 3 లక్షలు అధికారులు ఖర్చుపెటుతూ వారే తిరిగి ఇంకొకఉద్యోగికి సంవత్సరానికి 144 రూ. కన్న ఒక దమ్మిడీ ఎక్కువ ఖర్చుపెట్టరు. పరమేశ్వరుడు సమస్తమానవులకు ఒకేవిధముగా భార్యాబిడ్డలు సంసారము ఇత్యాదిపరిస్థితులన్నీగూడా సమానంగానే ఏర్పాటు చేసాడు. జన్మతోనే క్షుత్పిపాసలను ఏర్పాటుచేసాడు. యిటువంటప్పుడు ప్రజల బాగోగులకు బాధ్యులైనవారు మనిషియొక్క జీవితానికి కనీసము ఎంత ఖర్చవుతుందో అది కొంచమైన గమనించిన న్యాయముజరిగేది. ఇట్టి గమనింపులకోసరమున్నూ, ప్రజలబాగును గమనించటానికిని తగిన అవకాశముకోరుకున్నా గదా ఈజనాభాలను ప్రతి పదేసి సంవత్సరాలకు తయారుచేయుట. కాని అది నిజమైన ఉపయోగంకోసంగాక లోకప్రదర్శనానికి ఉపయోగమౌతూఉంది. తమరికి నిత్యము ఎవరియొక్క సహాయములేకపోతే ఒకపనికూడా నడవదో అట్టి తమ తాబేదారులనుగురించియే నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తూ మనకు మనుష్యులు ఎంత తగ్గింపుజీతమునకైనా సిద్ధమౌతున్నారని నిబ్బరంగా మనపోషకులు ఉన్నారు. తగ్గింపుకు వస్తున్నారంటే దరిద్రమంత ఎక్కువగా విచారించేనాథులు లేరు. ఆమాత్రంకూడా ఆసరాలేని మాలోటివాండ్లసంగతి "ఎవరికి పుట్టినబిడ్డరా వెక్కి వెక్కి యేడుస్తున్నది" అన్నట్లు ఉన్నదనటంలో అసంభవం ఏమీలేదు. ఈదారిద్ర్యంచేత మాలోటివారు చేయరానిపనులను చేయుటానికిగాని, వినరాని మాటలచేత ఒకరినొకరు నిందించుకొంటూ కొట్టుకొనుటకుగాని ఎవ్వరూ వెనక్కితియ్యరు.

మా మొరలు, మాలోపాలు, మాచింతలు వినేవారుగాని, చూచేవారుగాని, తీర్చేవారుగాని ఇప్పట్లో ఎవ్వరూలేరు. మశూచి, కలరా, క్షయ, ఇత్యాది వ్యాధులుమాత్రము మాకు చాలా స్నేహితులుగా ఉంటూ ఎడబాయకుండా ఆదరించుతూఉంటవి. ఇంతకూ కర్మను తప్పించలేరనే సిద్ధాంతం మనకి కొత్తది గాదుకదా?

వర్మ:—కాలమానపరిస్థితులు ఆవిధంగా వొచ్చుకొని వస్తూఉన్నవి. ఎవరివీలునుబట్టి వారు నీవిప్పుడు చెప్పిన సమస్యలన్నిటినీ నివారించటానికి ప్రయత్నాలు చేస్తునేయున్నారు. ఇంకా ఎవరేమి చేయగలరు? ఎవరదృష్టమువారిది,

పేదరాలు:—నేచెప్పేదికూడా అదే. కానీ, కొంచము సహకారమునేగుణము ప్రపంచమునగల సుగుణాల్లోకెల్ల ఎక్కువదిగదా? దేశంలో ఏపనైనా

సాకారంగా కావాలంటే ప్రభుత్వమువారిద్వారా జరిగినట్లుగా ఇంకోవిధంగా జరగజాలదని నాకు ఘంటాపథంగా తెలుసును. అయినను మీవంటిధనవంతులు, మీవంటి వదాన్యులు, చాలామంది ఇంకా ఉన్నారు. ధనమంతా భూమిలో ఇంకిపోలేదు. సముద్రంలో కొట్టుకుపోలేదు. తమతోడి దేశీయులు, తమతోడిమానవులు, తమతోడిసోదరులు వీధుల్లోపడి గుప్పెడు మెతుకులకోసరం, జానెడు గుడ్డకోసం మానాభిమానాలు నశింపచేసుకుని కడుపుకొట్టుకొంటూ గుమ్మముగుమ్మముదగ్గిరా దేవురిస్తూఉంటే డబ్బును నిల్వచేసుకొన్న కోటీశ్వరులంతా హద్దుపద్దు నీతినియమములేని అనవసరభోగాలకు, అనవసర వేడుకలకు, అనవసర మెహర్బానులకు లక్షల లక్షల ధనాన్ని వెచ్చిస్తున్నారు. ఇంకా వెచ్చించటానికి ఒళ్లెరగని ఆవేశంతో ఎదురుచూస్తున్నారు; తమ కాళ్లవద్ద ఈడిగిలపడి తాము ఎడమకాలితోతన్నినా తమ దయాభిక్షాన్నే యాచిస్తూఉన్న తనసోదరులను కొంచమైనా గమనించటానికి ధనవంతుల మనస్సుల్లో చోటులేదు. ఇంతకూ వాళ్లమనస్సుల్లోమాత్రము శాంతిఉందా? నిజంగాచూస్తే శాంతి అన్నది భోగములోకంటే త్యాగంలోనే ఉందని పెద్దల వాక్యంగదా? అట్టిది లేకపోవటంచేతను, మానవ హృదయాల్లో తృష్ణను పెరిగించేపరిస్థితులు ఎక్కువగా నాల్గువైపులా చెలరేగటంచేతనూ ఎక్కడా నిజమైనతృప్తి, శాంతి, కల్లోకూడాలేవు. ధార్మిక వాసనలు నైతికకట్టుబాట్లు ప్రజలహృదయాల్లో నానాటికి నశిస్తున్నాయి. కాబట్టి మానవులకు సహజముగా కలబడవలసిన జగత్కళ్యాణస్వరూపాన్ని కన్పింపజేసే హృదయపరివర్తన ధనవంతులహృదయాల్లో కలుగవలెను. అది అత్యవసరము. అట్టి హృదయపరివర్తనమే లేకపోతే పైపై ఉపశమనాలు పైపై ఉపన్యాసాలు ఏమియు లాభంలేదు. అట్టి సుకాలము ఎప్పుడువస్తుందోకదా? కేవలము దీనజనావలోకనమాత్రంచేత సమస్తసౌఖ్యాలను వదలివేసి సర్వభూతదయాళుత్వమును సందేశరూపంగా ప్రపంచానికంతా బోధించిన త్యాగశిరోమణులవంటి త్యాగులు తిరిగి జన్మింతురు గాక.

వర్మ:—బిడ్డా! నీవు చెప్పినదంతా సబబుగానే యున్నది. గాని లోకమర్యాదను, లోకరివాజును, నీవంతగా గుర్తించలేవు. ఒక ధనవంతుడు ఎంతమందిని, ఎన్నివిధాలని పోషించి కాపాడగలడు? ఇదంతా జరిగనేరనిపని.

పేదరాలు:—తండ్రీ! మీరడిగారు కాబట్టి నాకు తోచింది నేచెప్పటానికి సాహసిస్తున్నాను. లోకమర్యాదల్ని వదలివేయుమని కోరటంఅస్వభావం. గాని అందులో మతామతములు, సమయాసమయాలు ఉన్నవిగదా? ఇంట్లోబిడ్డలు ప్రాణావసానస్థితిలో ఉంటే ఊళ్లో పేరంటానికవరైనా వెళ్లటానికి తలుస్తారా? అన్నీ తెలిసిన మీకు నేచెప్పటం అనవసరం. తమ త్యాగగుణాన్ని చూపించటానికి దీనులనుపోషించటానికి అనేకమార్గాలున్నాయి. పూర్వము తమవంటి వారంతా సామాన్యులందరికీ సహజమైనబుద్ధి చాతుర్యం ప్రోత్సహించే అనేకరకములైన కళలనూ, వ్యక్తిత్వాభివృద్ధి సూచకములైన పరిశ్రమలనూ, దోహదపరచుటకు ప్రయత్నించి శాశ్వతకీర్తిని పొందినట్లుగా మీకు బాగాతెలియును. ఇప్పటిలో ఒక్కవ్యక్తికే లాభమంతాచేర్పించే కంట్రాక్టుపద్ధతులు, లైసెన్సుపద్ధతులు అంతులేకుండా పెరిగిపోయినాయి. సామాన్యులందరు కష్టజీవులై అల్లాడటం దానితోకూడా సమంగా పెరిగింది. ఇది ప్రతిదేశంలోనూఉంది కాని ఆదేశములవారు తమ్ముతాము రక్షించుకొంటూ లోపాలను వెంటనే తెలుసుకుంటే దిద్దుబాటు చేసుకుంటారు. మనకిమాత్రము అట్టిది అనుభవం ఏమో అని అనుకోవాలసివస్తున్నది. ఇంకొక్కసంగతి. క్రొత్తక్రొత్తపనిముట్లను కనుక్కొంటూఉన్న ధీమంతులు క్రొత్తక్రొత్తమార్గములను చూపించుకూఉన్న మహానీ



1028

యులు చాలామందియున్నారు. ఇంకా బయల్దేరుచున్నారు. పాలితులందరిబాగును దృష్టియందుంచుకొనవలసిన పాలకులు అతనిని ప్రత్యేకంగా గౌరవించి ఆ పనిముట్లను తమస్వాధీనంలోవుంచుకుంటే ఇంత దుర్భక్షకులు సామాన్యులలో ఉండరు. ప్రభుత్వమునకు తగినంత ధనముఉండి తండ్రిదగ్గరఉన్న ధనము పిల్లలందరికీ వినియోగించి పంచిపెట్టునట్లుగా అధికారులు ఆధనమంతా సద్వినియోగపర్చటానికి సాధ్యమౌతుంది. అందువలన పేదలు కొంతవరకైనా పన్నుల బాధలుతగ్గ సుఖపడునట్లుగా అధికారులు చేయగలరు. అదిగాకుండా కోట్లకొద్దిధనము ఒకేవ్యక్తి స్వాధీనమందుండుట సంభవించదు. దీని నమలునందుంచ ప్రయత్నిస్తూ వ్యవసాయాభివృద్ధికి సకలవిధాల దోహద మిచ్చినట్లైతే ప్రజలు కొంతవరకైనా శాంతి సౌఖ్యాలను పొందగలరు. ధర్మస్వరూపుడును ధర్మసంస్థాపకుడును అయిన పరమాత్ముని రక్షణచేత రక్షింపబడేవారినే గాక రక్షకులు లేనివాళ్లనికూడా రక్షించి తన దీనజనబాంధవుడనే బిరుదును సార్థకపరకునే వేళ తప్పకుండా వచ్చును గాక. నేనిక సెలవు పుచ్చుకొనెదను. అని నమస్కరించి తిరిగిచూడకుండ వెడలిపోయెను. వర్మయు ఆమె ప్రసంగమునుగూర్చి యోచించుచూ అటులనే కూర్చుండెను.


# జండుగారి బాలషూలార్క

బిడ్డలు తమకుగల బాధలను తెలియపరచుటకు శక్తిలేక ఎక్కువగా ఏడ్చుచున్నారు. సాధారణముగ బాధలేక బిడ్డలు ఏడ్చుటలేదు. బిడ్డలు సాధారణముగా అజీర్ణము, ఉబ్బసము, ఈడ్పు, మొదలగు వ్యాధులతో బాధపడుచున్నారు. పండ్లు మొలచుటకు ప్రారంభించునపుడు, విరేచనములు, కడుపునొప్పి, మొదలయిన వ్యాధులు కలుగుచున్నవి. ఈబాధ లన్నిటికిని జండుగారి బాలషూలార్క మిక్కిలి యుపయోగకరమైనది. ప్రతియింటియందును ముఖ్యముగా యుండదగిన ఔషధము.




ధర బుడ్డి 1-కి 0-13-0

జండుఫార్మసూటికల్ వర్క్సు, లిమిటెడ్,

బొంబాయి 23.

మదరాసు రాజధాని ఏజంట్లు

దామోదర్ అండు కంపెనీ, 78 చైనాబజారురోడ్డు,

మద్రాసు.

N. B. జండుగారి ఔషధములు, మా ఏజంట్లవద్దనున్ను, ఇతరఔషధశాలలందును దొరకును.




1029